# సాక్షి చిత్తూరు

ఆదివారం । 30 । మార్చి । 2025




**ఈవీఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత**

చిత్తూరు కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ శనివారం అధికారులతో కలిసి తనిఖీ చేశారు. - IIలో



**దళితుడి దుకాణం తొలగింపు**

పుత్తూరు పట్టణంలో శనివారం గురవయ్య అనే దళితుడి షాపును అధికారుల అండతో టీడీపీ నేతలు తొలగించారు. - IIలో

**రంజాన్ వేళలు**

| | ఇఫ్తార్ ఆదివారం (సా) | సహర్ సోమవారం (ఉ) |
|---|---|---|
| చిత్తూరు | 6-30 | 4-51 |
| పుంగనూరు | 6-31 | 4-54 |

## న్యూస్‌రీల్

### ఇంటింటా వెలుగులు నిండాలి



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డి



జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

**పుంగనూరు/వి.కోట:** శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో ఇంటింటా నూతన వెలుగులు నిండాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కోరారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రజలందరూ సంతోషంగా ఉగాది పండుగ జరుపుకోవాలని కోరారు.

### 1 నుంచి రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్

**చిత్తూరు కార్పొరేషన్:** జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏప్రిల్ 1వ తేదీ నుంచి స్లాట్‌బుకింగ్ సేవలు ప్రారంభించనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వినియోగదారులు వారు కోరుకున్న సమయంలో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా 1న స్లాట్‌బుకింగ్ ప్రారంభమవుతుందని, మరుసటి రోజు నుంచి నూతన విధానంలో రిజిస్ట్రేషన్లు మొదలవుతాయని వివరించారు.

### నేడు నాగయ్య కళాక్షేత్రంలో ఉగాది వేడుకలు



సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్

**చిత్తూరు కలెక్టరేట్ :** చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీ విశ్వావసు నామ సంవత్సర సంబరాలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, ప్రముఖులకు సత్కారం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమానికి ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

### చుక్క..ముక్క ఖర్చు రూ.5.05 కోట్లు



దున్నపోతును బలి ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్న భక్తులు (ఫైల్)

**పుంగనూరు:** పుంగనూరు ప్రజల ఆరాధ్య దైవం సుగుటూరు గంగమ్మ జాతరలో మద్యం, మాంసానికి ప్రజలు వెచ్చించిన మొత్తం దాదాపు రూ.5.05కోట్లుగా అంచనా వేస్తున్నారు. జాతరను మంగళ, బుధవారాల్లో కోలాహలంగా నిర్వహించారు. ధనిక, పేద అనే తేడా లేకుండా శక్తి మేరకు గంగమ్మకు పొట్టేళ్లు, కోళ్లు, దున్నపోతులను బలి ఇచ్చారు. రెండు రోజుల పాటు పుంగనూరు ప్రజల ఖర్చు ఒక్కసారి గమనిస్తే ఎవరైనా విస్మయానికి గురికావాల్సిందే. అధికారుల లెక్కల మేరకు రూ.47 లక్షల మద్యం విక్రయాలు జరిగాయి. అలాగే 3 వేల గొర్రె, పొట్టేళ్లను అమ్మవారికి బలి ఇచ్చారు. 20 వేల కోళ్లను సమర్పించి ఆరగించారు. పుంగనూరు నియోజవర్గంలో మొత్తం రూ.5.05 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు వెల్లడిస్తుండడం గమనార్హం.

● గణపతి తేజం



ఉగాది పండుగ సందర్భంగా విద్యుద్దీప కాంతులీనుతున్న కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయం

● శ్రీవారి వైభవం




విశేషాలంకరణలో తిరుమల శ్రీవారి ఆలయం

SUNDAY SPECIAL

# ఇదిగో ఉపాయం.. అదిగో ఆదాయం!

టమాట సాగు గాలిలో దీపంలా మారిపోయింది. ఒక సీజన్‌లో లాభాల పంట పండిస్తే.. మరో సీజన్ నష్టాల బారిన పడేస్తోంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం టమాట ధర రోజురోజుకీ తగ్గిపోతోంది. అన్నదాతకు నిద్ర లేని రాత్రులను మిగుల్చుతోంది. అయితే వినూత్నంగా ఆలోచిస్తే నష్టాలను అధిగమించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం పంట విక్రయంపైనే కాకుండా టమాట పచ్చళ్లు.. ఊరగాయల తయారీపై రైతులు దృష్టి సారించాలని కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సిద్ధం చేసే నిల్వ చట్నీలను పట్టణ వాసులు విపరీతంగా ఇష్టపడుతుంటారని గుర్తుచేస్తున్నారు. అందుబాటులోని మార్కెట్‌ను అందిపుచ్చుకుని నిల్వ పచ్చళ్ల అమ్మకాలతో ఆదాయ మార్గంలో పయనించవచ్చని స్పష్టం చేస్తున్నారు.



- భారీగా పడిపోయిన టమాట ధరలు
- మరింత తగ్గితే నష్టాలు తప్పవంటున్న రైతులు
- సరికొత్తగా ఆలోచిస్తే లాభదాయకమంటున్న నిపుణులు
- పచ్చళ్లు.. ఊరగాయల తయారీపై దృష్టి సారించాలని సూచనలు

**పలమనేరు :** రైతంటే కేవలం పంటలు సాగు చేయడమే కాకుండా.. ఇతర ఆదాయ మార్గాలను సైతం ఎంచుకోవాలని మార్కెటింగ్ నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా నిత్యం పెరుగుతూ.. తరుగుతూ ఉంటే టమాట సాగు చేపట్టిన వారు మరింత కొత్తగా ఆలోచించాలని కోరుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో దారుణంగా పడిపోయిన టమాట ధరలను చూసి కుంగిపోకుండా.. ఇతరత్రా అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెబుతున్నారు. దళారీల బారిన పడి పెట్టుబడికి కూడా దిక్కులు ఆలకించాల్సిన పనిలేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని వెల్లడిస్తున్నారు.

**మార్కెట్‌లో డిమాండ్**

పల్లెసీమల్లో టమాట నిల్వ పచ్చళ్లను రెండు వెరైటీలుగా చేస్తుంటారు. పచ్చికాయలతో కొందరు, పండు టమాటాలను ఎండబెట్టి మరికొందరు పచ్చడి చేసుకుంటారు. ఈ రెండు రకాల పచ్చళ్లకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది.

**పచ్చళ్లకు భలే క్రేజ్**



నోరూరిస్తున్న టమాట పచ్చడి

వేడి వేడి అన్నంలో కాసింత టమాట పచ్చడి వేసుకుని.. అందులో కాస్త నెయ్యి కలుపుకుని తింటే ఆ రుచి వర్ణనాతీతం. ప్రధానంగా జంక్ ఫుడ్‌కు అలవాటు పడిన అర్బన్ ప్రాంతాల్లోని వారికి పల్లెరుచి నోటికి తెలియగానే ప్రాణం లేచి వస్తుంది. ఇదే జిహ్వ చాపల్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుంది. టమాటకు సరైన రేటు రాని పరిస్థితుల్లో పంటను నష్టాలకు అమ్ముకోకుండా పచ్చళ్లు.. ఊరగాయల తయారీకి వాడుకుంటే తద్వారా సులువుగా లాభాలను ఆర్జించుకోవచ్చు.


ఘుమ ఘుమలాడే టమాట పచ్చళ్లను రైతులే తయారు చేసి విక్రయించుకుంటే నష్టపోయే మాటే ఉండదు. ప్రస్తుతం మార్కెట్‌లో టమాట 14 కేజీల బాక్సు కేవలం రూ.100 పలుకుతోంది. ఇక ఆటోల్లో రూ.వందకు పది కిలోల టమాటల లెక్కన అమ్ముకోవాల్సి వస్తోంది. లేకపోతే జ్యూస్ ఫ్యాక్టరీలకు అణాకానీకి పంటను అప్పగించాల్సి వస్తోంది.

**తయారీ ఇలా..**



టమాట పచ్చడిని రుబ్బుతున్న దృశ్యం

టమాటాలను ముక్కలుగా కోసుకోవాలి. ఆరు బయట బాగా ఎండబెట్టుకోవాలి. అందులో కొత్త చింతపండు, మిరప పొడి, రాళ్ల ఉప్పు వేసుకుని రోటిలో మెత్తగా రుబ్బుకోవాలి. అనంతరం మెంతి పొడి, ఆవాల పిండి,, వెల్లుల్లి వేసుకోవాలి. శనగనూనెలో పోపు పెట్టుకుని పచ్చడిలో కలుపుకోవాలి. ఈ పచ్చడి దాదాపు ఏడాది పాటు చెక్కు చెదరకుండా ఘుమ ఘుమలాడుతూ నిల్వ ఉంటుంది.



ఎండబెట్టిన టమాట ముక్కలు

అదే టమాట పంటను పచ్చడి, ఊరగాయగా తయారు చేసి విక్రయించుకుంటే నష్టం ప్రసక్తే ఉండదు. పెట్టుబడి అయినా దక్కుతుందా లేదా అంటూ కొట్టుమిట్టాడే దుస్థితి ఎన్నటికీ రాదు.

**ఆరోగ్యానికి మంచిది**



టమాట పచ్చడి భుజిస్తే ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులోని యాంటీ యాక్సిడెంట్లు, లైకోపిన్, విటమిన్-ఏ ఎంతో ప్రయోజనకరం. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. చర్మ సంబంధిత వ్యాధులు తగ్గుతాయి. ప్రధానంగా టమాట నిల్వ పచ్చళ్లను తినడం మరింత శ్రేయస్కరం.

– కోమల, న్యూట్రీషియన్ ఏరియా ఆస్పత్రి, పలమనేరు

### నేడు, రేపు పనిచేయనున్న కార్యాలయాలు

**చిత్తూరు కార్పొరేషన్:** ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో సబ్‌రిజిస్ట్రార్, విద్యుత్ బిల్లుల చెల్లింపుల కేంద్రాలు ఆదివారం, సోమవారం పనిచేయనున్నాయి. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉన్నప్పటికీ పనిచేసే విధంగా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

### జీఎస్టీ రిటర్న్ దాఖలుకు అవకాశం

**చిత్తూరు కార్పొరేషన్:** జీఎస్టీ రిటర్న్ దాఖలుకు ఆది, సోమవారాల్లో సైతం అవకాశం కల్పించినట్లు ఆశాఖ సంయుక్త కమిషనర్ జాన్‌స్టీవెన్‌సన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉగాది, రంజాన్ సందర్భంగా ప్రభుత్వ సెలవు రోజులు అయినప్పటికి ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో వెసులుబాటు ఇచ్చినట్లు వెల్లడించారు. నెలాఖారులోపు రిటర్న్‌లను ఫైల్ చేయకపోతే డీలర్లకు ఆలస్య రుసుం, వడ్డీ విధించాల్సి వస్తుందని వివరించారు.

### ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగ అధ్యక్షుల నియామకం

**తిరుపతి మంగళం :** వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో ఎంవీ.రెడ్డెప్ప(చిత్తూరు), పీ.చంద్రశేఖర్‌రెడ్డి(చంద్రగిరి), డీ.రామచంద్రయ్య(గంగాధరనెల్లూరు), జీ.పెన్నవేలు సింహ(కుప్పం), పీ. కుమారస్వామి(నగిరి), గోవిందరెడ్డి(తిరుపతి) నియోజకవర్గాల నుంచి నియమితులైనట్టు పేర్కొంది.

● మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

## ప్రశ్నిస్తే అక్రమ కేసులా?



జ్యోతికుమార్ తల్లిదండ్రులను ఓదారుస్తున్న సునీల్‌కుమార్ తదితరులు

**ఐరాల:** కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించినందుకు అధ్యాపకుడు జ్యోతికుమార్‌పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ మండిపడ్డారు. జ్యోతికుమార్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన నేపథ్యంలో శనివారం మండలంలోని వడ్రాంపల్లెకు వెళ్లి బాధితుడి తల్లిదండ్రులను పరామర్శించారు. పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని, ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని భరోసా కల్పించారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ కూటమి సర్కార్ ఎన్నికల ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్ హామీల అమలు ఏదీ అంటూ అధ్యాపకుడు ప్రశ్నిస్తే అక్రమ కేసు బనాయించారని మండిపడ్డారు. ఎప్పుడూ లేని విషసంస్కృతిని కూటమి నేతలు తీసుకువచ్చారని విమర్శించారు. పేద విద్యార్థుల ఇబ్బందులు చూడలేక తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు ఇస్తారని సోషల్ మీడియాలో పోస్టు చేయడాన్ని టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోయారని ఆరోపించారు. చంద్రబాబు రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ, పౌర హక్కులను మంటగలుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఐరాల, పూతలపట్టు మండలాల కన్వీనర్లు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్ సుగుణశేఖర్‌రెడ్డి, కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు లీలజ, నేతలు చిన్నారెడ్డి, గురుమూర్తిరెడ్డి, కిషోర్, వేణురెడ్డి, వివేక్ పాల్గొన్నారు.



## పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లుకలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ అధికారులతో ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమ, పౌల్ట్రీ రంగం అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. పాల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందని వెల్లడించారు. ఈ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి ఉన్నారని వివరించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ, వెటర్నరీ డాక్టర్లు తమ పరిధిలోని పాడి రైతుల సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. బ్యాంకర్లతో సంప్రదించి అవసరమైన రుణాలను మంజూరు చేయించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రుణాల మంజూరులో తలెత్తే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో పశు సంవర్ధక శాఖ జేడీ ఆరీఫ్ పాల్గొన్నారు.

**అర్జీల పరిష్కారానికి చర్యలు**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు నమోదవుతున్న అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అందించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. మండలాల వారీగా రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్ అర్జీ లపై ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం సమగ్ర నివే దికను కలెక్టరేట్‌కు పంపాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్‌ఓ మోహన్‌కుమార్, ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.

### తులసీనాథం నాయుడికి ఉగాది పురస్కారం



**పలమనేరు:** తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పైనేనీ తులసీనాథం నాయుడును ఉగాది పురస్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసినట్లు ఎంపికైనట్టు శనివారం సమాచారం అందింది. రెండు దశాబ్దాలుగా తెలుగుభాషాభివృద్ధి కోసం తులసీనాథం నాయుడు పలు కార్యక్రమాలను చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సేవలకు గుర్తింపుగా ఆయనకు ఉగాది పురస్కారం దక్కడంపై సాహితీ అభిమానలు, కవులు, రచయితలు అభినందలు తెలిపారు.

## క్లుప్తంగా

### రేపటి 'గ్రీవెన్స్' రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. శనివారం ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ సెలవు కావడంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయం గమనించాలని కోరారు.

**పోలీసు కార్యాలయంలో సైతం..**

చిత్తూరు అర్బన్: రంజాన్ పండుగ నేపథ్యంలో ఈనెల 31న పోలీసు కార్యాలయంలో నిర్వహించాల్సిన గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు.

### ప్రభుత్వోద్యోగి 'పచ్చ'వేషాలు



కొదలమడుగులో టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న విల్వనాథం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : బంగారుపాళెం మండల విద్యాశాఖలో క్లస్టర్ రిసోర్సు పర్సన్ (సీఆర్పీ)గా విధులు నిర్వహిస్తున్న విల్వనాథం శనివారం నిర్వహించిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్నారు. అక్కడితో ఆగకుండా నిస్సంకోచంగా పార్టీ జెండా ఎగురవేశాడు. మండలంలోని కొదలమడుగు గ్రామానికి చెందిన విల్వనాథం బంగారుపాళెం ఎంఆర్‌సీలో సర్వశిక్ష అభియాన్ కింద రాగిమానుపెంట సీఆర్పీగా పనిచేస్తున్నాడు. అయితే విధులను పక్కన పెట్టి టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుంటారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్, డీఈఓ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### దళితుడి దుకాణం తొలగింపు

- అడ్డుకున్న మున్సిపల్ చైర్మన్‌పై దాడికి టీడీపీ నేతల యత్నం



రోడ్డుపై బైఠాయించిన మున్సిపల్ చైర్మన్ హరి

పుత్తూరు: పట్టణంలోని గురవయ్య అనే దళితుడి దుకాణాన్ని అధికారుల అండతో శనివారం స్థానిక టీడీపీ నేతలు తొలగించారు. దీంతో నాలుగేళ్లుగా డాక్యుమెంట్ రైటర్‌గా జీవనం సాగిస్తున్న గురవయ్య రోడ్డున పడ్డాడు. ఈ షాపునకు సమీపంలోని ఈశ్వరాలయానికి చెందిన స్థలంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారు. త్వరలో ప్రారంభించనున్న ఈ భవనం వద్ద అడ్డుగా ఉన్న ట్రాన్స్‌ఫారమ్‌ను గురవయ్య దుకాణ స్థలంలో ఏర్పాటు చేయాలని టీడీపీ నేతలు నిర్ణయించారు. ఈ క్రమంలో షాపును తొలగిస్తుండగా మున్సిపల్ చైర్మన్ హరి అడ్డుపడ్డారు. దీంతో చైర్మన్‌పై దాడికి సైతం పచ్చమూక యత్నించింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాల వారిని నిలువరించారు. అనంతరం గురవయ్య షాపును పూర్తిగా తొలగించి, అక్కడే ట్రాన్స్‌ఫారమ్ ఏర్పాటు చేశారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ హరి తన అనుచరులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

## గుడి సంబరం.. మదినిండా భక్తిభావం



ఆధ్యాత్మికత సంస్కృతికి దర్పణం పడుతూ గుడి సంబరాలు జన హృదయాల్లో భక్తి భావాలను రేకెత్తించింది. పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు గుడి సంబరాలు కార్యక్రమాన్ని అద్వితీయంగా చేపట్టారు. ఈ సంబరాలకు రాష్ట్రం నుంచే కాక ఇతర ప్రాంతాలతో పాటు స్థానిక నృత్య కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నృత్య కళాకారులు శ్రీరామలీలలు, అర్ధనారీశ్వర, విఘ్నేశ్వర స్తుతి, హనుమాన్ చాలీసా, వాయుస్తుతి, వందనం రఘునాథ, నారసింహ స్తుతి వంటి ఘట్టాలను తమ నృత్యాలతో చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పరంపర ఫౌండేషన్ అధినేత డాక్టర్ శ్రీనాగి మాట్లాడుతూ అంతరించిపోతున్న సంస్కృతిని మరింత విస్తృతం చేసి తద్వారా సమాజంలో ఆధ్యాత్మికత, సంస్కృతిని పెంపొందించేందుకు గుడి సంబరాలను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో గుడి సంబరాలు చేపట్టడం మహద్భాగ్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి తిలకించిన బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో పరంపర ఫౌండేషన్ ప్రతినిధులు ప్రమోద్‌రెడ్డి, శశిరెడ్డి, అధిక సంఖ్యలో పుర ప్రజలు పాల్గొన్నారు.



– తిరుపతి కల్చరల్

## ఉపాధి అవకాశాల పెంపునకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఉపాధి అవకాశాల పెంపునకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశమందిరంలో ఈస్ట్‌మన్ ఎక్స్‌పోర్ట్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు టైలరింగ్‌లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరులో ఉపాధి అవకాశాల కల్పనకు ఈస్ట్‌మన్ ఎక్స్‌పోర్ట్ కంపెనీ గార్మెంట్స్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ గార్మెంట్ స్థాపనకు అవసరమైన భూ కేటాయింపులు పరిశీలిస్తున్నామని వెల్లడించారు. గార్మెంట్స్ నిర్వహణకు నైపుణ్యం కలిగి టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలు అవసరమన్నారు. స్థానికంగా ఉన్న మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ప్రజలు ఎక్కువగా తమిళనాడులోని వేలూరు, కర్ణాటకలోని బెంగళూరుకు ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ వలస వెళుతున్నారని వెల్లడించారు. గార్మెంట్స్‌లో పనిచేసేందుకు ఆసక్తి గల మహిళల వివరాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ లో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు మహిళలు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటవుతున్న గార్మెంట్స్ లో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న మహిళలు ముందుకురావాలని కోరారు. అనంతరం మహిళలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈస్ట్ మన్ ఎక్స్‌పోర్ట్ ప్రతినిధి మొహిద్దీన్, మెప్మా పీడీ రవీంద్ర, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి పద్మజ, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, జిల్లా కార్మిక శాఖ అధికారి ఓంకార్ పాల్గొన్నారు.

**ఈవీఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత**

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల యంత్రాలు భద్రపరిచిన ఈవీఎం గోడౌన్ వద్ద పటిష్ట భద్రత కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఈవీఎం గోడౌన్‌ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. డీఆర్‌ఓ మోహన్‌కుమార్, పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, అట్లూరు శ్రీనివాసులు, సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జగతి ఉన్నతికి గొడుగు 'ఉగాది'



కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జగతి ఉన్నతికి గొడుగు పట్టేది మన 'ఉగాది' పండుగని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య వ్యవస్థాపకుడు మర్రిపూడి దేవేంద్ర రావు తెలిపారు. శనివారం చిత్తూరు నగరంలోని సమాఖ్య కార్యాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. దేవేంద్రరావు మాట్లాడుతూ చీకటి వెలుగులు. అనేవి సృష్టిలోనే కాదు అందరి జీవితాల్లోనూ ఉంటాయని వెల్లడించారు. రచయితలు తోట గోవిందన్, శ్రీరాజు మాట్లాడుతూ తెలుగు ప్రజల సంస్కారానికి ఉగాది నిదర్శనమన్నారు. రచయిత ఎస్.మునీంద్ర ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. 20 మంది రచయితలను, సంఘ సేవకులను సాహితీ వేత్త దేవేంద్రరావు సన్మానించారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు తోట గోవిందన్, ఎం. శ్రీరాజు, ఎస్. మునీంద్ర, రోహిత్ కుమార్, కోటీశ్వర మొదలియార్, కె.ఆనందనాయుడు, వి.పవన్ జి. భూపతి, ఎన్.షణ్ముగం, కేశవసింగ్, ఎం.దినకరన్, ఎస్.శ్రావంత్, ప్రవళిక, ఎస్.భావన, లిఖిత, టి. మంజులాదేవి, నాగరాజు, మురాజ్, నరేంద్ర, భాస్కర్‌నాయుడు, రఫీ పాల్గొన్నారు.

### ఈకేవైసీ గడువు పొడిగింపు

చిత్తూరు రూరల్(కాణిపాకం): రేషన్ కార్డులకు సంబంధించిన ఈకేవైసీ చేయించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గడువు పొడిగించినట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 30వ తేదీలోపు రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవచ్చని సూచించారు. ఇప్పటి వరకు 17 లక్షల మంది వరకు ఈకేవైసీ చేయించుకున్నారని, ఇప్పటికీ 1.50 లక్షల మంది మిగిలారని వివరించారు.

### ఎన్‌టీఆర్ ఆశయ సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

కుప్పం : ఎన్‌టిఆర్ ఆశయాల సాధనే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం కుప్పం బస్టాండు వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలతో సమావేశం నిర్వహించారు. తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.

## జెండాకు అవమానంపై ఆగ్రహం

- నిందితులపై చర్యలకు డిమాండ్



వెదురుకుప్పం మండలంలో..



పెనుమూరు మండలంలో..

కార్వేటినగరం : జాతీయ జెండాను అహంకారంతో అవమానించిన టీడీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ జాతీయ జెండాను ఏర్పాటు చేసే దిమ్మెకు పసుపు రంగు వేసి దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన వారిపై కేసు నమోదు చేయాలని స్పష్టం చేశారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలను పార్టీ కార్యాలయాలు మార్చడం ఏంటని ప్రశ్నించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడడం రాజ్యాంగ విరుద్ధమని మండపడ్డారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ కార్యాలయం వద్ద, లేదా ఇతర ప్రాంతాల్లో నిర్వహించుకోవాలని సూచించారు. ఏకంగా ప్రభుత్వ కార్యాలయాలకు పార్టీ రంగులు వేసి జెండాలు ఎగురవేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మండిపడ్డారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో పెనుమూరు మండలం చింతపెంట పంచాయతీ అమ్మగారిపల్లి(బండకిందపల్లి) గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారని తెలిపారు. ఆ స్తంభానికి పచ్చరంగు వేసి టీడీపీ జెండా ఎగురవేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆక్సిజన్ ట్యాంకర్ దగ్ధం

- ఆక్సిజన్ లీకై దగ్ధమైన ట్యాంకర్
- డ్రైవర్‌కు గాయాలు
- ఫైరింజన్‌తో మంటలు అదుపు



బోడబండ్ల క్రాస్ వద్ద జాతీయ రహదారిపై దగ్ధమవుతున్న వాహనాలు




ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కంటైనర్ డ్రైవర్ జాదవ్

బంగారుపాళెం: ఆగిఉన్న గ్యాస్ ట్యాంకర్‌ను వెనుక నుంచి కంటైనర్ ఢీకొనడంతో గ్యాస్ లీకై ట్యాంకర్ దగ్ధమైంది. ఈ సంఘటన బంగారుపాళెం మండలం బోడబండ్ల క్రాస్ సమీపంలో శనివారం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నై నుంచి బెంగళూరు పోతున్న ఆక్సిజన్ కంటైనర్ మార్గమధ్యంలో బోడబండ్ల క్రాస్ సమీపంలో టైర్ పంక్చరై రహదారిపై ఆగిపోయింది. అదే సమయంలో పుణే నుంచి కాన్పూర్‌కు ఆటోల లోడుతో వెళ్తున్న కంటైనర్ ఆగిఉన్న ఆక్సిజన్ ట్యాంకర్‌ను ఢీ కొంది. ఈ ఘటనతో ఆక్సిజన్ లీకై ట్యాంకర్‌కు, కంటైన్ ముందు బాగానికి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ జాదవ్(43) శరీరం కాలి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చిత్తూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అనంతరం ఫైరింజన్ ట్యాంకర్‌తో మంటలను అదుపు చేశారు. గాయపడిన డ్రైవర్‌ను 108లో చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సీఎంసీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. చెన్నై–బెంగళూరు రహదారిపై ప్రమాదం చోటు చేసుకోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు. ప్రమాదంలో ప్రాణాపాయం తప్పడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

# మంటల వెనుక.. పచ్చమూక

- బైరెడ్డిపల్లెలో వరుస అగ్నిప్రమాదాల గుట్టురట్టు
- సీసీ ఫుటేజీతో వెలుగులోకి వాస్తవాలు
- టీడీపీ స్థానిక నేత అనుచరులదే నిర్వాకం
- నిందితులను అరెస్ట్ చేసేందుకు జంకుతున్న పోలీసులు



బైరెడ్డిపల్లెలోని బ్రిక్స్‌ఫ్యాక్టరీలో కలపను పెట్రోల్ పోసి కాలుస్తున్న వ్యక్తుల సీసీ ఫుటేజీ దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : పలమనేరు నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లెలో మిస్టరీగా మారిన మంటల వ్యవహారం ఇప్పటికి బయటపడింది. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల దుకాణాలు అర్ధరాత్రి సమయంలో వరుసగా దగ్ధమతుండడం స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు సైతం గుర్తుతెలియని వ్యక్తుల పనేనంటూ కేసులు మూసేశారు. అయితే, శుక్రవారం రాత్రి జరిగిన నిప్పు పెట్టే వ్యవహారంలో సీసీ టీవీ కూటమి దొంగలను పట్టేసింది. పోలీసులు కనిపెట్టలేని నిందితులను అందరికీ తెలియజేసింది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. చూసినవారు ఇది టీడీపీ స్థానిక నేత ముఖ్య అనుచరుడి పనే అంటూ బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. కానీ, పోలీసులు మాత్రం దీనిపై విచారిస్తున్నాం త్వరలోనే నిందితులని పట్టుకుంటామని తప్పుకుంటున్నారు.

**ఇవన్నీ ప్రమాదాలు కావా?**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముందుగా చెక్‌పోస్ట్‌లోని మోతీ చెప్పుల దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. తర్వాత కొన్నాళ్లకు అదే చోట మరికొన్ని దుకాణాలు కాలిపోయాయి. తాజాగా కలపకు నిప్పుపెట్టారు. ఇటుకల పరిశ్రమ వద్ద అక్కడున్న ట్రాక్టర్లను రెండు దఫాలుగా పెట్రోల్ పోసి తగులబెట్టారు. ఇవన్నీ అర్ధరాత్రి జరిగిన ఘటనలే. దీంతోపాటు మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నేతల శిలాఫలకాలు, సచివాలయ బోర్డులను ధ్వంసం చేశారు. పెద్ద చెరువు కట్టపై విశ్రాంతికోసం ఏర్పాటు చేసిన సిమెంట్ కుర్చీలను పడగొట్టారు. వీటిపై ఫిర్యాదులున్నా పోలీసులు మాత్రం మీనమేషాలు లెక్కిస్తూనే ఉన్నారు.

**అచేతనంగా అధికారులు**

బైరెడ్డిపల్లె మండలంలో పోలీసులు, అధికారులు అచేతనావస్థకు వెళ్లిపోయారు. టీడీపీకి చెందిన ఇరువురు కీలక నేతలును కాదని అడుగు వేయలేని దుస్థితిలో ఉన్నారు. పచ్చమూక చెలరేగిపోతుంటే చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# శ్రీ విశ్వావసు నామ సంవత్సర రాశిఫలాలు - Advt Feature

## మేష రాశి
అశ్విని, భరణి, కృత్తిక మొదటిపాదం

**ఆదాయం -2, వ్యయం -14, రాజపూజ్యం -5, అవమానం -7**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిధునరాశి (తృతీయ) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (లాభం) కేతువు సింహరాశి (పంచమం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (వ్యయం)లో సంచారం ఏలి నాటి శని ప్రారంభం అయినది. ప్రతి విషయమునకు శని పేరు చెప్పి భయపడకండి. కేవలం ఈ సంవత్సరం పనులు ఆలస్యం అవ్వటమే కానీ పనులు పాడవ్వడం అనేది లేదు. దూకుడుగా నిర్ణయాలు చేయకండి. మిత భాషణ మరియు ఇతరుల వ్యవ హారములలో తలదూర్చకుండా ఉండడం చాలా అవసరం. ఇతరుల సహకారం తక్కువగా ఉంటుంది. రోజువారీ కార్యముల విషయమై మంచిగా వ్యవహరించి సత్ఫలితాలు అందుకుంటారు. అనవసర కాలక్షేపం కూడా చేస్తారు. కుటుంబ విషయాలు పరిశీలింపగా బంధువర్గంతో బహు జాగ్రత్తలు తీసుకోండి. పెద్దల ఆరోగ్య విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. పిల్లల అభివృద్ధి విషయంగా కూడా ఫలితాలు సానుకూలంగా ఉంటాయి. ఉద్యోగ విషయములు పరిశీలింపగా అధికారుల నుండి ఒత్తిడి ఎక్కువ ఉంటుంది. స్థానచలన ప్రయత్నాలు ప్రత్యేకం చేయాలి. ప్రమోషన్ ప్రయత్నాలు ప్రత్యేకం చేయకపోతే ప్రతికూల ప్రదేశాలకు చేరతారు. నూతన ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నవారికి పనులు వేగంగా సాగవు.

## వృషభం
కృత్తిక 2,3,4, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

**ఆదాయం -11, వ్యయం -5, రాజపూజ్యం -1, అవమానం -3**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిధునరాశి (ద్వితీయం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (దశమం) కేతువు సింహరాశి (చతుర్థం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (లాభం)లో సంచారం. శని సంచారం గురు సంచారం అనుకూలంగా ఉన్న కారణంగా చాలా మంచి ఫలితాలు అందుకుంటారు. సాంఘీకంగా గౌరవ మర్యాదలు పెరుగుతుంటాయి. సమయపాలనతో చాలా విజయాలు సాధిస్తారు. కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతుంటాయి. ధర్మకార్యములు తరచుగా చేస్తూ ఉంటారు. ఆహార విహార విషయాలలో మీకు సంతుష్టి కలుగుతుంది. రోజువారీ కార్యముల విషయమై ఎటువంటి సమస్యలు లేని జీవితం సాగుతుంది. కుటుంబ విషయాలు పరిశీలింపగా అన్ని విధములుగా మంచి ఫలితాలు అందుకుంటారు. పిల్లల అభివృద్ధి వారి నిమిత్తంగా చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ ఆచార సంబంధమైన కార్యక్రమములు చేస్తుం టారు. ఉద్యోగ విషయములు పరిశీలింపగా ప్రమోషన్‌లు వచ్చే అవకాశం ఉంటుంది. మీకు అందరి నుండి సహాయ సహకారములు బాగా అంది మంచి విజయములు సాధించే అవకాశం ఉన్నది. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో వున్నవారికి పనులు చాలా అనుకూలంగా ఉంటాయి.

## మిథునం
మృగశిర 3,4, ఆరుద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

**ఆదాయం -14, వ్యయం -2, రాజపూజ్యం -4, అవమానం -3**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (జన్మం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (నవమం) కేతువు సింహరాశి (తృతీయం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (దశమం)లో సంచారం. తరచుగా బుద్ధి భ్రంశనమునకు లోనవుతుంటారు. దూరప్రాంతములకు వెళ్ళాలి. చేయు పనులు విడిచి ప్రశాంతంగా దూరంగా వెళ్ళాలనే కోరిక పెరుగుతుంటుంది. చేసే ప్రతిపనీ పరధ్యానంగా చేస్తారు. మీ ప్రయత్నాలు ఏవీ సరిగా సాగవు. అందరూ 'నన్ను సరిగా గౌరవించడం లేదు' అనే భావన పెరుగుతుంది. చతుష్పాద జంతువు లతో ఇబ్బంది ఉంటుంది. రోజువారీ కార్యముల విషయమై సమయ పాలనతో కూడి పనులు పూర్తి అవుతుంటాయి. కుటుంబ విషయాలు పరిశీలింపగా మే వరకు కొన్ని సమస్యలతోనూ మే నుండి కొంత అనుకూల వాతావరణము ఉంటుంది. మీ కుటుంబ వ్యవహారములలో ఇతరుల ప్రమేయం నిర్ద్వంద్వంగా ఖండిస్తే సుఖపడ తారు. ఉద్యోగ విషయములు పరిశీలింపగా మీకు సహకరించే అధికారులు విరుద్ధంగా ఉంటారు. ప్రతిపనీ మీ అవగాహన లోపం వలన ఒకటికి రెండుసార్లు చేయవలసి వచ్చి ఇబ్బంది పడుతుంటారు. వ్యాపారస్తులకు అనుకూల స్థితి తక్కువ. ఆలోచన లకు, అమలుకు సంబంధం లేక సాధారణ ఫలితాలు అందుకుంటారు.

## కర్కాటకం
పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

**ఆదాయం -8, వ్యయం -2, రాజపూజ్యం -7, అవమానం -3**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (నవమం) ప్రవేశం, రాహువు మే 19వ తేదీన కుంభరాశి (అష్టమం) కేతువు సింహరాశి (ద్వితీయం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (భాగ్యం)లో సంచారం. ఒకసారి విశేష అనుకూల వాతావరణం, ఒక్కోసారి ప్రతికూల వాతావరణం ఈ విధంగా చికాకుపడతారు. మే నెల దగ్గర నుండి మానసిక, శారీరక శ్రమ ఎక్కువ. మీరు మీ వస్తువులు ఏదో ఒక రూపంలో నష్టపడుతూ ఉంటారు. జాగ్రత్త పడాలి అనే విషయాలలో అనవసర ప్రయత్నాలు చేస్తారు. తరచుగా పుణ్యక్షేత్ర సందర్శన నిమిత్తం ప్రయాణం చేస్తారు. రోజువారీ కార్యముల విషయమై అన్ని సమయపాలన లేక ఇతర పనులు కూడా చికాకు పెడుతుంటాయి. కుటుంబ విషయాలు పరిశీలిం పగా పిల్లలకు మీకు సరిగా మానసిక స్థితి సమన్వయం అవ్వక బాధపడతారు. పెద్దల ఆరోగ్య విషయం కూడా ప్రతికూలంగా ఉంటుంది. బంధువుల ప్రమేయం కుటుంబ విషయాలలో ఎక్కువ. ఉద్యోగ విషయములు పరిశీలింపగా అధికారుల ఆగ్రహావేశాలు మే తరువాత ఎక్కువ. మే వరకు చాలా తెలివిగా ప్రవర్తిసారు. స్థానచలనం మరియు ప్రమోషన్ విషయాలు ఆశించిన రీతిగా ఉండవు జాగ్రత్తపడండి. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్న వారికి మోసపోయే లక్షణాలు ఉన్నాయి.




## సింహం
మఖ, పుబ్బ, ఉత్తర మొదటి పాదం

**ఆదాయం -11, వ్యయం -11, రాజపూజ్యం -3, అవమానం -6**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (లాభం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (సప్తమం) కేతువు సింహరాశి (జన్మం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (అష్టమం)లో సంచారం. ప్రతి విషయంలో మనస్పర్ధలు రావడం వాటిని సరిచేసుకోవడంతో కాలక్షేపం అవుతుంది. గురుబలం ఈ సంవత్సరం అంతా శ్రీరామ రక్ష. పార్టనర్‌షిప్ వ్యవహారములలో జాగ్రత్త అవసరం. అన్ని రకాలైన వ్యవహారములలోనూ గురు అనుకూలం దృష్ట్యా మంచి ప్రణాళికలు చేసినా మీ చుట్టూ ఉన్న సన్నిహితులను నమ్మి సమస్యలకు దగ్గర అవుతుంటారు. రోజువారీ కార్యముల విషయమై మీకు భోజన, స్నాన, నిద్ర వంటి వాటికి కూడా సమయపాలన ఉండదు. కుటుంబ విషయాలు పరిశీలింపగా ప్రత్యే కంగా చెప్పే విషయం ఏమిటంటే 'మితభాషణ' అవసరం. దాని వలన సుఖపడ తారు. శని, రాహు సంచారం బాగా లేదు. ఇతరుల ప్రమేయం ఆపివేయండి. ఉద్యోగ విషయములు పరిశీలింపగా అధికారుల అండదండలు బాగా ఉంటాయి. మీరు మీ క్రింద పనిచేయువారి ద్వారా ఇబ్బందులకు దగ్గరవుతారు. మోసపోవు లక్షణాలు గోచరిస్తున్నాయి. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్న వారికి అయోమయ స్థితి ఉంటుంది. తెలివిగా ఉన్నా మోసపోతుంటారు.

## కన్య
ఉత్తర 2,3,4, హస్త, చిత్త 1,2 పాదాలు

**ఆదాయం -14, వ్యయం -2, రాజపూజ్యం -6, అవమానం -6**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (దశమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (షష్ఠం) కేతువు సింహరాశి (వ్యయం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (సప్తమం)లో సంచారం మే నెల వరకు పుణ్యకార్యములు, ధర్మకార్యములు విజ్ఞాన వినోద కార్యములు చేస్తుం టారు. ధర్మకార్యాచరణ ద్వారా సంఘంలో గౌరవ మర్యాదలు పెంచుకుంటారు. ప్రతి పనిలోనూ మే నెల నుండి ధైర్యం పెరుగుతుంది. అయితే ప్రతిపనీ ఆలస్యం అవుతుంది. తరచుగా కుటుంబమునకు ఎక్కువ సమయం దూరం గడపవలసి ఉంటుంది. కొన్నిసార్లు భయం పొందుతారు. రోజువారీ కార్యముల విషయమై మే నుండి సమయపాలన లేకుండా ప్రవర్తిస్తారు, చికాకుపడతారు. కుటుంబ విషయ ములు పరిశీలింపగా బంధువుల రాకపోకలు అధికం అవుతాయి. మీకు, మీ కుటుంబ సభ్యులకు ఉన్న ఆలోచనలు సరిగా అమలు చేయలేరు. అయితే ఆనందంగా కాలక్షేపం చేయగలుగుతారు. మే నెల నుండి మీ కింద పనిచేయు వర్కర్స్‌తో ఇబ్బంది ఉంటుంది. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్న వారికి తేలికపాటి ప్రయత్నాలతో కొన్నిసార్లు శుభవార్త అందుకుంటారు. వ్యాపారస్తులకు అన్ని పనులు సానుకూలంగా సాగుతాయి. లాభాలు తక్కువ అయినా ప్రశాంతంగా ఉంటారు.

## తుల
చిత్త 3,4, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

**ఆదాయం -11, వ్యయం -5, రాజపూజ్యం -2, అవమానం -2**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (భాగ్యం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (పంచమ) కేతువు సింహరాశి (లాభం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (షష్ఠ)లో సంచారం. చాలా సమస్యలకు పరిష్కారం పొందగలిగే కాలం ప్రారంభం అయినది. క్రమంగా మే నెల నుండి శుభ పరిణామములు ఎక్కువగా ఉంటాయి. పుణ్యకార్యములు, శుభకార్య ములు, సాంఘీక కార్యములు చేయు అవకాశం ఎక్కువగా ఉంటుంది. గత సమస్యలు కూడా తీరు అవకాశం ఈ సంవత్సరం మే నెల నుండి అవకాశం ఎక్కువ అవుతుంది. ఆనందంగా ఉంటారు. రోజువారీ కార్యముల విషయమై సానుకూలం ఉంటుంది. సమయపాలన చేయు అవకాశములు ఎక్కువ. కుటుంబ విషయాలు పరిశీలింపగా అంతా శుభ పరిణామములు ఎక్కువ. భార్యాపిల్లల ద్వారా వారి నుండి మీకు మీ నుండి వారికి జరగవలసిన అంశాలు అంతా కూడా చక్కగా పూర్తిచేయు అవకాశములు ఉంటాయి. ఉద్యోగ విషయములు పరిశీలింపగా ఇబ్బందులు లేని జీవితం సాగుతుంది. రాబోవు కాలంలో క్రమంగా అభివృద్ధి వైపు ప్రయాణం సాగు తుంది. అనూహ్యంగా అందరూ సహకారం బాగా చేస్తారు. నూతన ఉద్యోగ ప్రయ త్నాలలో ఉన్నవారికి మంచి సలహాలు అంది చక్కటి లాభాలు అందుకుంటారు.

## వృశ్చికం
విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

**ఆదాయం -2, వ్యయం -14, రాజపూజ్యం -5, అవమానం -2**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (అష్టమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (అర్థాష్టమ) కేతువు సింహరాశి (దశమం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (పంచమం)లో సంచారం. సాధారణ స్థాయికి విరుద్ధంగా మీకు గ్రహచారం ఉన్నది. అందువలన ప్రత్యేక నియమాలలో జీవనం సాగించాలి. ఏ పనిలోను స్థిరబుద్ధి ప్రదర్శించలేరు. అందరికీ మీ వ్యవహారముల మీద తక్కువ స్థాయి ఆలోచనలు ఉంటాయి. మీరు తరచుగా చోరులు, అన్ని ప్రభుత్వ అధికారులు వంటి వారిలో ఎవరితోనయినా చికాకు పడుతూనే ఉంటారు. తరచుగా క్రూరవాక్యములు పలుకుతూ ఉంటారు. రోజువారీ కార్యముల విషయమై మీరు సరియగు స్థిరబుద్ధి ప్రదర్శింపక పనులు ఆలస్యం చేసి ఇబ్బంది పడతారు. కుటుంబ విషయాలు పరిశీలింపగా మీ నుండి కుటుంబీకులకు అందవలసిన సర్వీసెస్‌లు అన్నీ ఆలస్యంగా అందుతాయి. ఉద్యోగ విషయములు పరిశీలింపగా మీరు సరియగు దృష్టి ప్రదర్శింపక పనులు పాడుచేసుకుంటారు. మీ సన్నిహితులు తప్పనిసరిగా మీకు అత్యవసర సమయాలలో సహకరించరు. ప్రమో షన్, స్థానచలనములు అనుకూలంగా లేవు. వ్యాపారస్తులకు అనుకూల లాభాలు లేకపోయినా ఇబ్బందులు ఉండవు. వ్యాపార సమయంలో ఒత్తిడి ఎక్కువ.




## ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ మొదటి పాదం

**ఆదాయం -5, వ్యయం -5, రాజపూజ్యం -1, అవమానం -5**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (సప్తమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (తృతీయం) కేతువు సింహరాశి (భాగ్యం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (అర్థాష్టమం)లో సంచారం. ఈ రాశి వారికి ఈ సంవత్సరం చక్కగా చేసిన పనులకు గుర్తింపు సరిగా అందదు. అయితే గొప్పగా ఓర్పు సహనం ప్రదర్శించి సాధారణ స్థాయి జీవనమునకు ఇబ్బం దులు రాకుండా జాగ్రత్తపడతారు. అందరితోనూ కలహములు రాకుండా స్నేహ భావం ప్రదర్శిస్తారు. శరీరం గాంభీర్యం కోల్పోయినట్లుగా గోచరిస్తుంది. స్నేహితు లతో మితంగా సంభాషణ, సంచారం చేయండి. రోజువారీ కార్యముల విషయమై ప్రధానంగా ప్రత్యేక దృష్టి ఉంచండి. వీటి తరువాతనే ఇతర కార్యములు. కుటుంబ విషయములు పరిశీలింపగా శుభపరిణామములకు అవకాశములు ఎక్కువ. మీ అవసరాలు గుర్తించి సహకరించే కుటుంబ సభ్యులు ఉన్న కారణంగా మంచి ఫలితాలు ఉంటాయి. సోదరద్వేషం తప్పదు. ఉద్యోగ విషయములు పరిశీలింపగా ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాలు జాగ్రత్తగా చేసుకుంటే మీకు కావలసిన స్థలం చేరే అవకాశం ఉంటుంది. ఎవరూ సహకరించరేమో అనే రీతిగా మీ చుట్టూ పరిస్థితులు ఉంటాయి. కానీ విజయం తథ్యం. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్నవారికి అనుకూలం.

## మకరం
ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1,2 పాదాలు

**ఆదాయం -8, వ్యయం -14, రాజపూజ్యం -4, అవమానం -5**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (షష్ఠం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (ద్వితీయం) కేతువు సింహరాశి (అష్టమం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (తృతీయం)లో సంచారం. కేవలం శని రాహు సంచారం అనుకూలం చేత చాలా విజయాలు సాధిస్తారు. అయితే జూన్ వరకు కుజ సంచారం ప్రభావంగా ప్రయాణ విషయాలలో చికాకులు ఉంటూ ఉంటాయి. స్వబుద్ధి, స్వశక్తితో మీరు చాలా విజయాలు సాధిస్తారు. దీర్ఘమైన పనులు కొంచెం శ్రమతో కూడిన పనులు జూన్‌లోపుగా పూర్తి చేసుకుని ప్రయత్నం చేయడం మంచిది. రోజువారీ కార్యముల విషయమై ఎటువంటి ఇబ్బం దులు లేకుండా కాలక్షేపం జరుగుతుంది. అయితే కుటుంబ విషయాలు పరిశీలిం పగా మీరు కొంచెం ఓర్పుగా కుటుంబ వ్యవహారముల చూసుకోవాలి అంతా చక్కగా ఉంటుంది. కానీ చికాకులు ఎప్పుడు ఎలా మొదలవుతాయో చెప్పలేని స్థితి ఉంటుంది. ఉద్యోగ విషయములు పరిశీలింపగా శని సంచార అనుకూల ప్రభావం సర్వత్రా విజయమే. మంచి గుర్తింపు వస్తుంది. ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాలు, ప్రమోషన్ ప్రయత్నాలు కూడా చాలా విశేషంగా అనుకూల ఫలితాలు ఇస్తాయి. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్నవారికి పనులు జూన్ వరకు విశేషం.

## కుంభం
ధనిష్ఠ 3,4, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

**ఆదాయం -8, వ్యయం -14, రాజపూజ్యం -4, అవమానం -5**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (పంచమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (జన్మం) కేతువు సింహరాశి (సప్తమం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (ద్వితీయం)లో సంచారం. ఏలినాటి శని తృతీయ భాగంలో నడుస్తుంది. అయితే పెద్దగా రాహువు యోగిం చకపోయినా గురుబలం అనుకూలం వలన చాలా మంచి ఫలితాలు అందుకుం టారు. ప్రతి విషయంలోనూ కొన్నిసార్లు తెలివిగాను, కొసార్లు అసహనంతో ప్రవర్తిస్తుంటారు. అన్ని విషయాలలో మీ గౌరవ మర్యాదలకు భంగం కలుగకుండా ఉండేలాగ మీ ప్రవర్తనను చూసుకుంటూ గడపండి. రోజువారీ కార్యముల విషయమై మీరు స్థిరచిత్తంతో ప్రవర్తింపక కొత్త కొత్త సమస్యలు అందుకుంటారు. కుటుంబ విషయాలు పరిశీలింపగా అనవసర కలహాలకు కుటుంబ సభ్యులకు అవకాశం ఇచ్చేలాగ ప్రవర్తిస్తుంటారు. అయితే గురుబలం అనుకూలం వలన పెద్ద స్థాయి ఇబ్బందులు కుటుంబ విషయంగా ఈ రాశివారికి ఉండవు. ఉద్యోగ విషయములు పరిశీలింపగా మీరు ఓర్పుగా కొన్నిసార్లు ప్రవర్తించి మంచి ఫలితాలు అందుకుంటారు. కొన్నిసార్లు చికాకుగా వ్యవహరించి ఇబ్బందులు పొందుతారు. వ్యాపారస్తులకు అంతా శుభ ఫలితాలే ఉంటాయి.

## మీనం
పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

**ఆదాయం -5, వ్యయం -5, రాజపూజ్యం -3, అవమానం -1**

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (అర్థాష్టమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (వ్యయం) కేతువు సింహరాశి (షష్ఠం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (జన్మం)లో సంచారం. ఏలినాటి శని జన్మంలో రెండవ భాగం ప్రారంభం. జన్మ శని వ్యయ రాహు తగు జాగ్రత్తలతో కాలక్షేపం చేయాలి. మీ ప్రమేయం లేకుండా సమస్యలు తలెత్తే సమయం. అందరినీ అనుమానిస్తారు. మీరు అందరి చేత అనుమానింపబడతారు. వీలైనంత వరకు ఇతర పనులు ఆపివేయండి. ప్రతి పనిలోనూ మందగమనం ఉంటుంది. రోజువారీ కార్యముల విషయమై బహు శ్రద్ధ, జాగ్రత్త వహించండి. అది మిగిలిన దినచర్యను రక్షిస్తుంది. కుటుంబ విషయాలు పరిశీలింపగా మీకు ఇబ్బంది లేని జీవనశైలి ఉంటుంది. అయితే మీరు చూపించే అలసత్వం మరియు వాయిదా పద్ధతులు మీకు అవనసర కలహములు, మానసిక ఒత్తిడి సృష్టిస్తాయి. ఋణ విషయములో అవమానం సృష్టించకుండా జాగ్రత్తపడండి. కాలం అనుకూలం లేదు. ఋణం ప్రమాదకరము. ఆరోగ్య విషయంలో నేత్ర బాధలు ఉన్నవారు కొంచెం ఇబ్బంది ఎక్కువ పొందుతారు. కోర్టు వ్యవహారములలో ఉన్నవారికి అందరూ బాగా సహకారం చేస్తారు అనే వారు కూడా మోసం చేస్తారు.

